సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 7 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 18 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.3 చొప్పున పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.7°/12.9°

జిల్లాలో శుక్రవారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృత మైంది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

యోగి వేమన వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా రంగజనార్దన



ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) వీసీ జింకా రంగజనార్దన కడప యోగి వేమన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. యోగి వేమన యూనివర్సిటీ వీసీ సూర్యకళావతి పదవీ కాలం ముగియడంతో ఇన్‌చార్జ్ వీసీని నియమించారు. రెగ్యులర్ వీసీని నియమించేంత వరకు రంగజనార్దన ఇన్‌చార్జ్‌గా కొనసాగనున్నారు.

గనులు, భూగర్భ శాఖ డీడీగా రాజశేఖర్

అనంతపురం టౌన్: గనులు, భూగర్భ శాఖ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా రాజశేఖర్‌ను నియమిస్తూ డైరెక్టర్ వెంకటరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు డీడీగా పని చేసిన పాపారావు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తుండడంతో ఆయన్ని కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో కర్నూలు జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌కు అనంతపురం డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

9 మంది బైక్ రేసర్ల అరెస్ట్



బైక్ రేసర్లను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ

పెనుకొండ: అతివేగంగా వస్తూ ప్రజలను భయభ్రాంతులను గురిచేయడంతో పాటు రాకపోకలకు అంతరాయం కలిగించిన 9 మంది యువకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు...పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయ సమీపంలో 44వ జాతీయ రహదారిపై కొందరు యువకులు బైక్ రైస్ నిర్వహిస్తూ వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని కర్ణాటక రాష్ట్రం టుంకూరుకు చెందిన నవాజ్, చింతామణికి చెందిన సికిందర్, సిద్లఘట్టకు చెందిన తంజీమ్, శిరకు చెందిన ఖలీం, మహబూబ్‌బాషా, అలాగే జిల్లాలోని గోరంట్లకు చెందిన కార్తీక్, హిందూపురానికి చెందిన బాబు, సుహేల్, లేపాక్షికి చెందిన మహమ్మద్ సయ్యద్‌ను అరెస్టు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన కారు

గోరంట్ల: మండల పరిధిలోని గొల్లపల్లి సమీపంలో బూదిలి– రెడ్డిచెరువుకట్ట మధ్య శుక్రవారం సాయంత్రం ఓ కారు దగ్ధమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిలమత్తూరు మండలం చాగలేరు పంచాయతీ చానగానిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ప్రభావతి, సాత్విక్‌రెడ్డి హిందూపురం నుంచి తమ ఇండికా కారు (ఏపీ03ఏఎం9749)లో స్వగామానికి బయలుదేరారు. కారు గొల్లపల్లి సమీపంలోకి రాగానే షార్ట్ సర్క్యూట్ కాగా, మంటలు చెలరేగాయి. దీంతో భయభ్రాంతులకు గురైన డ్రైవర్ శంకర్‌రెడ్డి కారు నిలిపివేయగా, రామచంద్రరెడ్డి కుటుంబసభ్యులంతా కిందకు దిగారు. మంటలు ఉధృతం కావడం...ఆర్పేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో కారు పూర్తి కాలిపోయింది. డ్రైవర్ శంకరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గోరంట్ల పోలీసులు తెలిపారు.

ఐదు రోజులు వర్షాల్లేవ్


బుక్కరాయసముద్రం: జిల్లాకు రానున్న ఐదు రోజులూ వర్ష సూచన లేదని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పగలు ఉష్ణోగ్రతలు 30.5–31.4, రాత్రి 17.8–18.6 డిగ్రీలుగా నమోదు కావచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 80–86, మధ్యాహ్నం 42–50గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

నిజాలు సమాధి!





మురుగునీరు చేరడంతో బురమయమైన కబరస్తాన్ (ఫైల్)



కబరస్తాన్ పునర్ నిర్మాణ పనులు ఆమోదం తెలుపుతూ 40 మసీదుల ముతవల్లీలు చేసిన తీర్మానం

ఇది ధర్మవరం ఇందిరానగర్‌లోని కబరస్తాన్. సమీపంలోని మురుగు నీరంతా లోపలికి వచ్చేయడంతో సమాధులన్నీ ఇలా మునిగిపోయాయి. దీంతో పట్టణంలోని ముస్లిం మత పెద్దలంతా కలిసి అధునికీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులు చేపట్టగా... టీడీపీ నేతలు నిసిగ్గు రాజకీయానికి తెరతీశారు. నిజాలు సమాధి చేసి... కబరస్తాన్‌పై కట్టుకథలల్లి సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేశారు. ముస్లింలంతా మూకుమ్మడిగా ఎదురు తిరగడంతో తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోయారు.

- ధర్మవరం కబరస్తాన్ పునర్‌నిర్మాణంపై టీడీపీ రాజకీయం
- మురుగునీటిలో మునిగిపోయిన సమాధులు
- అభివృద్ధి పనులకు 40 మసీదుల ముతవల్లీల తీర్మానం
- అందరి ఆమోదంతోనే పనులు ప్రారంభం
- కబరస్తాన్ అభివృద్ధి పనులపై పరిటాల శ్రీరామ్ కట్టుకథలు
- రాత్రికి రాత్రి చదును చేశారంటూ నిందారోపణలు
- టీడీపీ నీచరాజకీయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ధర్మవరం: హిందూముస్లింల ఐక్యతకు, శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ధర్మవరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అలజడులు సృష్టించాలని పన్నాగం పన్నారు. తన స్వార్థం కోసం కబరస్తాన్‌ను పావుగా వాడుకున్నారు. పట్టణంలోని మసీదు, అంజుమన్ కమిటీల ఆధ్వర్యంలో జరిగే అంతర్గత వ్యవహారాలను రాజకీయం చేసి ఎమ్మెల్యే కేతిరెడ్డిపై బురద జల్లాలని ప్రయత్నించారు.

అసలేం జరిగిందంటే..

ధర్మవరం ఇందిరానగర్‌లో ముస్లింల కబరస్తాన్ ఉంది. దానికి ఆనుకునే ఎగువ భాగంలో పెద్ద డ్రైనేజీ ఉంది. దీంతో మురుగునీరు తరచూ కబరస్తాన్‌లోకి వచ్చి చేరుతుండగా, సమాధులన్నీ మునిగిపోతున్నాయి. దీనికి తోడు స్థలం తక్కువగా ఉండటంతో కబరస్తాన్ పూర్తిగా సమాధులతో నిండిపోయింది. దీంతో ముస్లింలు ఎవరైన చనిపోతే ...వారి అంత్యక్రియలను పట్టణానికి 6 కి.మీ దూరంలోని ఈద్గా మైదానంలో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శాశ్వత పరిష్కారం కోసం చర్యలు..

కబరస్తాన్‌లో మురుగునీరు చేరకుండా చూడటంతో పాటు వసతులు కల్పించేందుకు గత అక్టోబర్‌లో.. జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు సమావేశం నిర్వహించారు. కబరస్తాన్‌ను పునర్ నిర్మించాలని 40 మసీదులకు చెందిన ముతవల్లీలు ఆమోదించి తీర్మానం చేశారు. అందులో భాగంగా కబరస్తాన్‌లోని సమాధులను తొలగించి మైదానం మొత్తం 4 అడుగులకుపైగా మట్టితో ఎత్తు చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. అభ్యంతరాలకు రెండు నెలల సమయం తీసుకున్నారు. అందుకు గడువు కూడా ముగియడం, ఎవరూ అభ్యంతరం చెప్పకపోవడంతో 3 రోజుల క్రితమే మసీదు కమిటీలు, అంజుమన్ కమిటీల ఆధ్వర్యంలో మత పెద్దలు, దాతల సహకారంతో పనులను ప్రారంభించారు.

పరిటాల శ్రీరామ్ రంగ ప్రవేశంతో రాజకీయ రంగు

కబరస్తాన్ పునర్నిర్మాణ పనులు ప్రశాంతంగా సాగిపోతుండగా... గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వాటి గురించి తెలుసుకున్నారు. స్థానికంగా నివాసం లేని ఆయన...నిజానిజాలు తెలుసుకోకుండా కబరస్తాన్లో సమాధులను ఏక పక్షంగా తొలగిస్తున్నారని, ఎమ్మెల్యే కేతిరెడ్డిని టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేశారు. దీనిపై ముస్లిం మత పెద్దలంతా స్పందించారు. కబరస్తాన్ పునర్ నిర్మాణ పనులన్నీ తమ ఆధ్వర్యంలో సాగుతున్నాయని, దానికి రాజకీయ రంగు పులమడం అన్యాయమన్నారు. దీన్ని రాజకీయం చేయవద్దని రాజకీయ పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అందరి ఆమోదంతోనే పనులు..



ధర్మవరంలోని అన్ని మసీదు కమిటీలతో చర్చించి 40 మంది ముతవల్లీల ఆమోదంతోనే కబరస్తాన్ పునర్నిర్మాణ పనులు చేస్తున్నాం. ఇందులో ఎలాంటి వివాదం లేదు. రాజకీయ పార్టీల నాయకులు ఇందులో జోక్యం చేసుకోకూడదు. చిన్నపాటి లోటుపాట్లు ఉంటే మేము చర్చించుకుని సమస్యను పరిష్కరించుకుంటాం.

– ముస్తాక్ అహ్మద్, ముతవల్లి, జామియా మసీదు, ధర్మవరం.

రాజకీయం చేయొద్దు



ఇస్లాం సంప్రదాయంలో కబరస్తాన్‌ల పునర్నిర్మాణం కొత్తేమీ కాదు. గతంలో అనంతపురంలోని ఈద్గాలో, బత్తలపల్లి కబరస్తాన్, హిందూపురంలోనూ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ధర్మవరంలోనూ అందరి ఆమోదంతోనే ముస్లింలతా కలసికట్టుగా దాతల సహకారంతో కబరస్తాన్‌ను పునర్నిర్మిస్తున్నాం. వీటిని రాజకీయం చేయవద్దు.

– జాకీర్, ముతవల్లి, మదీనా మసీదు, ధర్మవరం

ఐక్యతను దెబ్బతీయొద్దు



కబరస్తాన్ పునర్ నిర్మాణం పవిత్ర కార్యం. ఇందులో ఏ రాజకీయ పార్టీ జోక్యం చేసుకోకూడదు. అంజుమన్ కమిటీ, మతపెద్దలు, మసీదు కమిటీల ఆధ్వర్యంలోనే పనులు జరుగుతున్నాయి. ప్రతి ముస్లిం ఈ పనుల్లో భాగస్వామిగా ఉంటాడు. ముస్లింల ఐక్యతను దెబ్బ తీసే విధంగా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దు.

– స్టార్ ఖలీల్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు, ధర్మవరం

గీత దాటితే చర్యలు



కబరస్తాన్ పునర్ నిర్మాణం సున్నితమైన అంశం. ఏ ఒక్కరూ రెచ్చగొట్టే ప్రకటనలు చేయకూడదు. ఈ విషయంపై ఇప్పటికే ముస్లిం మత పెద్దలందరితో చర్చించాం. కబరస్తాన్ పునర్నిర్మాణంలో ఎవరికైనా సందేహాలుంటే మత పెద్దల ద్వారా నివృత్తి చేసుకోవాలి. చట్టపరిధి దాటి సోషల్ మీడియా ద్వారా అసత్యాలు ప్రచారం చేసినా, భావోద్వేగాలు రెచ్చగొడితే చర్యలు తప్పవు.

– సుబ్రమణ్యం, వన్‌టౌన్ సీఐ, ధర్మవరం

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- సమగ్ర సమాచారంతో రావాలని చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచన

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులంతా సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలని చైర్ పర్సన్ ఆదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఇక్బాల్ అహమ్మద్, వై.శివరామిరెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, బసంత్‌కుమార్, ఎంపీలు రంగయ్య, మాధవ్, 14 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరవుతారని పేర్కొన్నారు. గత సమావేశాల్లో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలతో పాటు ఈసారి జరిగే సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేలా సిద్ధమై రావాలని చైర్‌పర్సన్ సూచించారు. సభ్యులకు మాత్రమ అనుమతి ఉంటుందని, బయటి వ్యక్తులెవరూ సమావేశ భవన్‌లోకి అడుగుపెట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. డీఈ లోకేష్‌బాబు, ఎస్‌ఐ ఫణీంద్ర, సిబ్బంది గంగరాజు, ముక్కనేశ్వర కూడిన బృందం శుక్రవారం ఉదయమే పీహెచ్‌సీకి వచ్చింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు, గర్భవతులకు అందుతున్న సేవలు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ల పనితీరు, మందుల నిల్వపై విజిలెన్స్ అధికారులు స్థానికులను ఆరాతీశారు. అనంతరం ఆస్పత్రికి మంజూరైన నిధులు, ఖర్చు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ బృందం వెంట వైద్యాధికారి వెంకట చిరంజీవితో పాటు వైద్య సిబ్బంది వారి వెంట ఉన్నారు.

‘సీబీఎస్‌ఈ’తో విద్యార్థులకు మేలు

- ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి



సీబీఎస్‌ఈపై శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

హిందూపురం టౌన్: రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్న సీబీఎస్‌ఈ సిలబస్‌తో నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి తెలిపారు. సీబీఎస్‌ఈ సిలబస్‌పై ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు స్థానిక వివేకానంద మిలీనియం పాఠశాలలో ఇస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఈఓ మాట్లాడుతూ... సీబీఎస్‌ఈ సిలబస్ అమలుకు జిల్లాలో 49 పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. దీనివల్ల ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మరింత రాణించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్ అమలులో ఉన్న పాఠశాలల్లో బోధన అత్యాధునికంగా ఉంటుందని, విద్యాలయాల పర్యవేక్షణ బోర్డు పరిధిలో ఉంటుందన్నారు. ఆరో తరగతి నుంచే జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో రాణించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తారన్నారు. అనంతరం సీబీఎస్‌ఈపై విషయ నిపుణులు వినీతా రెజీనా, సమగ్ర శిక్ష నుంచి సర్వేశ్వరి, లక్ష్మీనారాయణ ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈఓ గంగప్ప, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ మహేంద్రరెడ్డి ఉన్నారు.

తెలుగుదేశం పార్టీకి ఇదేమి ఖర్మ?!

- కార్యక్రమానికి జనం కరువు
- విద్యార్థులతో ఫొటోలకు ఫోజులు
- బలవంతంగా నినాదాలు



విద్యార్థులను బలవంతంగా నిల్చోబెట్టి ఫొటోకు ఫోజిస్తున్న టీడీపీ నాయకురాలు పర్వీన్‌బాను

గాండ్లపెంట: తెలుగుదేశం పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు రావడం లేదు. కార్యక్రమాలను ఎలాగైనా కొనసాగించాలని చివరకు విద్యార్థులను బలవంతంగా రప్పించుకుంటున్నారు. ఇలాంటి ఘటనే గురువారం శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం తుమ్మలబైలు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ అంటూ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తులెవరూ హాజరు కాలేదు. అదే సమయంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసి పాఠశాల బయటి వైపు ఉన్న బోరు వద్ద ప్లేట్లను శుభ్రం చేసుకుంటుండడాన్ని టీడీపీ నాయకురాలు పర్వీన్ బాను, మరి కొందరు గమనించారు. విద్యార్థులను పిలవగా మొదట వారు కూడా రాలేదు. ఫొటో తీసుకుంటామంటూ బలవంతంగా పిలిపించుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయించారని విద్యార్థులు భానుప్రకాష్‌నాయక్, ప్రణీత్ తెలిపారు. జగన్ మామ తమకు ట్యాబ్‌లు, అమ్మఒడి ఇస్తున్నారని కూడా తెలిపామన్నారు. ఆ సమయంలో పాఠశాలలో పది మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థులపై పర్యవేక్షణ లేదని సర్పంచ్ ఆంజనేయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజా చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను పర్యవేక్షించాల్సిన ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలలో లేకపోవడంతో ఇలా జరిగిందన్నారు. ఇదే విషయంపై ఉపాధ్యాయులను వివరణ అడగ్గా.. విద్యార్థులు భోజనాలు చేసిన అనంతరం తాము భోజనానికి వెళ్లామని, అంతలోనే నినాదాలు విని బయటకు వచ్చి విద్యార్థులను లోపలికి పిలుచుకున్నామని చెప్పారు. ఉన్నత పాఠశాల కావడంతో పర్యవేక్షణ హెచ్ఎం చూసుకోవాల్సి ఉందని ఎంఈఓ కృష్ణానాయక్ తెలిపారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- జిల్లా నుంచి 60 సర్వీసులు నడిపేలా ప్రణాళిక
- అదనంగా రూపాయి కూడా వసూలు చేయబోమన్న డీపీటీఓ



డిపో మేనేజర్లతో మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూధన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఆర్ఎం కార్యాలయంలో డిపో మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సాధారణ సర్వీసులకు ఎంత చార్జి ఉంటుందో... ప్రత్యేక సర్వీసుల్లోనూ అదే చార్జీ వసూలు చేస్తారన్నారు. గతంలో ప్రత్యేక సర్వీసు చార్జీలు అధికంగా ఉండేవని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈసారి అదనపు చార్జీ వసూలు చేయడం లేదని వెల్లడించారు. పండుగ సందర్భంగా రిజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు 60 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఇందులో హైదరాబాదు నుంచి 10 సర్వీసులు, బెంగుళూరు నుంచి 20 సర్వీసులు, తిరుపతి నుంచి 10 సర్వీసులు, విజయవాడ నుంచి 5 సర్వీసులు, అనంతపురం– పుట్టపర్తి మధ్య 15 సర్వీసులు ఉంటాయన్నారు. తిరుగు ప్రయాణంలో 15 నుంచి 18వ తేదీ వరకు 70 ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రయాణికుల రద్దీని ఆధారంగా మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రత్యేక సర్వీసులన్నింటికీ రిజర్వేషన్ అందుబాటులో ఉందన్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఆఫీస్ ఆటోమేషన్, ల్యాండ్ సర్వేయింగ్ వంటి సర్టిఫికెట్ కోర్సుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఫైర్ సేఫ్టీ కోర్సుకు ఇంటర్మీడియెట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుకు డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసిన వారు, లేదా రెండు సంవత్సరాల అనుభవం ఉన్నవారు, ల్యాండ్ సర్వేయింగ్, ఆఫీస్ ఆటోమేషన్‌కు పదో తరగతి పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు అపారంగా ఉంటాయని తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 17 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

గ్రామస్థాయిలో అత్యాధునిక వైద్యం

- ‘పురం’ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తాం
- ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలి
- హిందూపురం జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్



హిందూపురం హెచ్‌డీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్



శివరం క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తోందని, తద్వారా గ్రామ స్థాయిలోనూ అత్యాధునిక వైద్య సేవలందుతున్నాయని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. ఇందుకోసం వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. శుక్రవారం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆస్పత్రి నిర్వాహణ, సదుపాయలు, వైద్యసిబ్బంది పనితీరుపై చర్చించారు. అలాగే హెచ్‌డీసీ నిధుల ఖర్చు వివరాలు, బిల్లులు పరిశీలించారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయల కల్పన కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు.

త్వరలోనే స్కానింగ్ సేవలు..

హిందూపురం ఆస్పత్రిలో త్వరలోనే స్కానింగ్ సేవలు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. హెచ్‌డీసీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్య సేవలను గ్రామస్థాయి వరకూ తీసుకెళ్లడానికి ప్రభుత్వం వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. అలాగే జిల్లాలో 18 అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటయ్యాయని, వాటిద్వారా వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అలాగే హిందూపురం ఆస్పత్రిలోని ఆర్థో వార్డుకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసే విధంగా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఎంసీహెచ్ సెంటర్‌లో పిడియాట్రిక్, గైనకాలజిస్టులు కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పోస్టులు భర్తీకి ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ మేరకు సదుపాయలు కూడా కల్పిస్తోందని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే ప్రథమ చికిత్సలు అందించగలిగితే జిల్లా, ఏరియా ఆస్పత్రులపై పనిభారం తగ్గితుందన్నారు. తద్వారా సరైన సమయంలో మెరుగైన సేవలు అందించ గలుగుతారన్నారు. మరోమూడు నెలల్లో వైఎస్సార్ వెల్‌నెస్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్‌సెంటర్లు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జిల్లా అంతటా అమలు చేయడంతో పాటు స్థానికంగానే 64 రకాల మందులు, 14 రకాల పరీక్షలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ తిప్పేంద్రనాయక్, డీపీఎంఓ కుళ్లాయప్ప నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, హెచ్ఎఫ్‌సీ సభ్యులు గంగిరెడ్డి, సురేష్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరిహారం..

అమరాపురం మండలం కె.శివరం గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన మహిళకు ప్రభుత్వం తరఫున బీమా మంజూరవుతుందని, ఇదే ప్రమాదంలో క్షతగాత్రులైన వారికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తామని కలెక్టర్ బసంత్‌కుమార్ వెల్లడించారు. హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్‌ను శివరం గ్రామ ప్రజలు కలిశారు. బాధితులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వరి కోత మిషన్

- డ్రైవర్, ఇద్దరికి గాయాలు

తాడిమర్రి: ఆర్టీసీ బస్సును వరికోత మిషన్ ఢీకొన్న ఘటన మండలంలోని నిడిగల్లు గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కడప డిపోకు చెందిన ఏపీ04జడ్ 0181 నంబర్ ఆర్టీసీ బస్సు 27 మందితో అనంతపురం నుంచి కడప వెళ్తోంది. మండల పరిధిలోని నిడిగల్లు, పుల్లం పల్లి గ్రామాల సమీపంలోకి రాగానే పొలాల్లో నుంచి వరి కోత మిషన్ ఉన్నపళంగా రోడ్డుపైకి వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఘటనలో డ్రైవర్ ఏసయ్య, ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ ఏసయ్య చాకచక్యంగా బస్సును కుడివైపు తిప్పడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు తపాలా ఉద్యోగుల సమావేశం

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ పరిధిలోని తపాలా ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా గ్రామీణ సడక్ సేవక్ యూనియన్ డివిజన్ ప్రతినిధులు కృష్ణయ్య, ఆరోగ్యప్ప శుక్రవారం తెలిపారు. రామచంద్రనగర్‌లోని డివిజన్ పోస్టల్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయ పై అంతస్తులో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సభ్యులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.




- గత ఏడాది డిసెంబర్‌లో కళ్యాణదుర్గం నియోజకవర్గం హులికల్లు దగ్గర ఓ పశువుల మందపై చిరుత దాడిచేసి ఆవుదూడను చంపింది. చిరుత దాడిలో మరికొన్ని పెయ్య దూడలు గాయపడ్డాయి. నియోజకవర్గంలో అడపాదడపా చిరుత దాడులు జరుగుతుండటంతో పశువుల కాపరులు భయాందోళనకు గురవుతున్నారు.





- గత ఏడాది నవంబర్‌లో పెనుకొండ సమీపాన వీరన్న కొండ దగ్గర మేకల మందపై చిరుత దాడిచేసింది. ఒక మేకను చంపేసి గుట్టలోకి ఈడ్చుకెళ్లింది. ఈ చిరుత వయసు రెండేళ్ల వరకూ ఉండవచ్చునని ఫారెస్టు అధికారులు అంచనా వేశారు. ఈ ఘటన అనంతరం నెల రోజులకే పెనుకొండ నియోజక వర్గం బొక్కసం పల్లి వద్ద ఉచ్చులో ఇరుక్కుని చిరుత మృతిచెందింది.

- ఇక్కడ కనిపిస్తున్న గుట్ట గూబనపల్లి సమీపంలోనిది. గ్రామంలోని నక్కరాయి గుట్ట వద్ద 30 అడుగుల సొరంగం మాదిరి గుహ ఉంది. ఇందులో చిరుతలు తలదాచుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో ఆహారం కోసం వెళ్లి తెల్లారేసమయానికి గుహలోకి వెళ్తుంటాయి. ఈ గుట్ట నుంచి పగలే చిరుతలు బయటికి రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



చిరుతల అలజడి

చిట్టడవులు.. గుట్టలు చిరుతలకు ఆవాస ప్రాంతాలు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటువంటి పరిసరాలు చాలా ఉన్నాయి. అందుకే చిరుతలు ఈ ప్రాంత పరిసరాలను ఆవాసాలుగా చేసుకున్నాయి. ఆహారం కోసం గొర్రెలు, మేకలు, పశువుల మందలపై దాడులు చేస్తున్నాయి. ఎక్కువగా కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నట్టు అటవీ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

- ఏడాదిలో 21 సార్లు జీవాలపై దాడి
- ఇప్పటివరకూ 42 పశువులు, గొర్రెల మృతి
- ఉమ్మడి జిల్లాలో 30కి పైనే చిరుతలున్నట్టు అంచనా
- ఇక్కడి పరిసరాలు అనుకూలంగా ఉండటమే కారణం
- వంకలు, గుంటల్లో పుష్కలంగా నీళ్లుండటం మరింత సానుకూలం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో చిరుతలు అలజడి రేపుతున్నాయి. చిరుతలు సాధారణంగా దట్టమైన అడవుల్లో ఉండవు. ఎక్కువగా పచ్చిక బయళ్లు, చిన్న చిన్న పొదలతో కూడిన అడవుల్లో ఉంటాయి. ఈ కారణంగానే చిరుతలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. రికార్డుల ప్రకారం చిరుతల సంఖ్య 10 నుంచి 15 వరకే అని చెబుతున్నా గడిచిన రెండేళ్లలో ఈ సంఖ్య 30 నుంచి 40 వరకూ చేరుకుని ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అడపాదడపా దాడులు

జిల్లాలో చిరుతలు ఎక్కువగా ఉన్నాయనేందుకు దాడులే ఉదాహరణ. 2022 సంవత్సరంలో ఏకంగా 21 సార్లు పశువులు, గొర్రెల మందలపై దాడులు చేశాయి. ఇందులో 42 పశువులు మృతి చెందాయి. దీంతో పాటు జింకల తర్వాత ఎక్కువగా కుందేళ్లను తినడానికి బాగా ఇష్టపడతాయి. ఉమ్మడి జిల్లాలో కుందేళ్ల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల చిరుత పులులు అనుకూల ప్రాంతాలుగా మలచుకున్నాయి. ఇప్పటి వరకూ జన సమూహాల్లోకి వచ్చి అలజడి సృష్టించిన దాఖలాలు లేవు. కానీ ఇటీవలే కళ్యాణదుర్గం సమీపంలో ఓ చిరుత వాహనం ఢీకొట్టగా మరణించింది. రాత్రి పూట రోడ్డు దాటుతుండగా ఈ ఘటన జరిగినట్టు ఫారెస్టు అధికారులు గుర్తించారు.

వేట దొరికితే నాలుగు రోజులు అదే మేత

చిరుతలు ఏదైనా పెద్ద జంతువును వేటాడితే దానిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లి నాలుగైదు రోజుల పాటు ఆరగిస్తాయి. రెండ్రోజుల పాటు ఎలాంటి ఆహారం లేకపోయినా చిరుతలు ఉండగలవు. అయితే ఆ సమయంలో రోజుకు ఒకటి లేదా రెండు సార్లు ఎక్కడైనా నీటి లభ్యత ఉన్న ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తాగుతాయి. విచిత్రమేమంటే చిరుత దేన్నయినా వేటాడితే దానికంటే ఎక్కువ బరువున్న జంతువునైనా అరకిలోమీటరు వరకూ ఈడ్చుకుని తీసుకెళ్లగలవు. 20 అడుగుల చెట్టుపైకి తీసుకెళ్లగలదు.

గత ఏడాది చిరుతల దాడి వివరాలు	
జీవాలు	మృతి చెందిన వాటి సంఖ్య
దూడలు	5
మేకలు	4
గొర్రెపిల్లలు	15
గొర్రెలు/పొట్టేళ్లు	18
మొత్తం	42

చిరుతలకు అనుకూలమైన ప్రదేశం



చిన్న చిన్న పొదలు, ఓ మోస్తరు చెట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా ఫారెస్టులో బాగున్నాయి. అంతేకాదు జిల్లాలో వేసవిలోనూ వాగులు, గుంటల్లో నీళ్లున్నాయి. కాబట్టి ఈ ప్రదేశం సానుకూలంగా ఉంది. గతేడాది చిరుత పులుల దాడిలో నష్టపోయిన పశువుల యజమానులకు రూ.2.79 లక్షల పరిహారం ఇచ్చాం.

– సందీప్ కృపాకర్, జిల్లా అటవీశాఖాధికారి





భారీగా చౌకబియ్యం పట్టివేత

నల్లమాడ: మండలంలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో భారీగా రేషన్ (చౌక) బియ్యం పట్టుబడింది. విజిలెన్స్ సీఐ రామారావు తెలిపిన మేరకు..విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద ఒక లారీని, మలకవేముల క్రాస్ రోడ్డులో మరో వాహనాన్ని పట్టుకున్నారు. 262 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.రెవెన్యూ అధికారుల సమక్షంలో తూకాలు వేసి గిడ్డంగికి తరలించారు. వాహనాలను సీజ్ చేశారు. డ్రైవర్లు బత్తల రాజేంద్ర, మణికంఠ, బియ్యం యజమాని రెడ్డిపల్లికి చెందిన రంగారెడ్డిపై కేసు నమోదు చేసి నల్లమాడ పోలీసులకు అప్పగించారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ రామారావు, ఏఈఈ కుళ్లాయిరెడ్డి, పీసీలు మనోహర్, మహేంద్రనాథ్‌రెడ్డి, షబ్నమ్, సీఎస్ డీటీ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడ్డ లారీ, చౌకబియ్యం

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: ధర్మవరం చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం వెలుగు చూసింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ భార్య ఆదిలక్ష్మి (57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా కుదుటపడలేదు. దీంతో రోజూ మనోవేదనకు గురయ్యేది. ఈనెల 2న పింఛను తెచ్చుకుంటానంటూ కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె తిరిగి వెళ్లలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. దీంతో ఆమె కుమారుడు నాగరాజు ఈ నెల 4న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదైంది. ఈ క్రమంలోనే శుక్రవారం ధర్మవరం మొదటి మరువ వద్ద మృతదేహం తేలియాడుతూ ఉండటం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫి పరిశీలించి ఆదిలక్ష్మిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఆదిలక్ష్మి(ఫైల్)

సర్వీసు హోం అభివృద్ధికి చర్యలు

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలోని సర్వీసుహోం, బాలసదనం, శిశుగృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ రాయలసీమ ఆర్జేడీ పద్మజ తెలిపారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆమె హోంలను తనిఖీ చేశారు. జేఎన్‌టీయూ రోడ్డులోని సర్వీసు హోంను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బుడ్డప్పనగర్, శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు, చిన్నారుల సంరక్షణను అడిగి తెలుసుకున్నారు. హోమ్స్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న సత్యసాయి భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రశాంతినిలయం ముఖ ద్వారం వద్ద రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా రథాన్ని లాగి ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

బత్తలపల్లి: స్థానిక వడ్డెర కాలనీకి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. బాలిక తల్లి శుక్రవారం బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. వడ్డెర కాలనీలో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలిక కర్ణాటకలోని దొడ్డబళ్లాపూర్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆరోగ్యం బాగాలేదని గతేడాది డిసెంబర్‌లో కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. అదే నెల 27న ఉదయం పనికి వెళ్లిన ఆమె తల్లి సాయంత్రం వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. బంధువులు, సన్నిహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లేదు. బుక్కపట్నం మండలం గసికవారిపల్లికి డేరంగుల విజయ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

110 క్యూసెక్కుల నీరు విడుదల

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటి సరఫరా పెంచినట్లు నీటి పారుదల శాఖ డీఈలు హనుమంతరావు, ఫక్కీరప్పలు శుక్రవారం తెలిపారు. గురువారం 50 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశామని, రెండో రోజు 110 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. కుడి కాలువ 6వ కిలోమీటర్ వద్ద లీకేజీ అవుతుంటే మరమ్మతు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఈలు సుబ్రమణ్యం, రమణ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన భార్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ఓ భార్య తన భర్తపై 'దిశ' పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రాజరాజశ్వేరీ తెలిపిన మేరకు... స్థానిక వేణుగోపాల్ నగర్‌లో నివాసముంటున్న యామినీ, గోవర్ధన్‌లకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఓ బాబు ఉన్నాడు. కొన్ని రోజుల నుంచి అత్తింటి వారి వేధింపులు అధికం కాగా, పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. అయినా గోవర్ధన్, అతని తల్లిలో మార్పు రాలేదు. వేధింపులు మరింత ఎక్కువ కావడంతో బాధితురాలు శుక్రవారం అనంతపురం దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులును ఆశ్రయించింది. విచారణ జరిపిన డీఎస్పీ కేసు నమోదు చేయాలని ఆదేశాలు చేశారు. భర్త గోవర్ధన్‌తో పాటు అతని తల్లి విజయనిర్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెక్‌పోస్టుల్లో నిరంతర పర్యవేక్షణ

- సెబ్ జిల్లా అధికారి రామకృష్ణప్రసాద్



మాట్లాడుతున్న సెబ్ జిల్లాధికారి రామకృష్ణప్రసాద్

పుట్టపర్తి అర్బన్: అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) జిల్లాధికారి రామకృష్ణప్రసాద్ ఆదేశించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌తో కలిసి శుక్రవారం జిల్లాలోని సెబ్ పోలీసులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్టేషన్లవారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. ప్రజలు నాటుసారా జోలికి వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల లిక్కర్ జిల్లాలోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీట్లు ఓపెన్ చేసిన వారిపై నిఘా ఉంచాలన్నారు. పాత నేరస్తులు నేరాలకు పాల్పడితే బైండోవర్లు చేయాలని ఆదేశించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

- సబ్ కలెక్టర్ కార్తీక్



విజేతలతో సబ్ కలెక్టర్ కార్తీక్, దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా

పెనుకొండ: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని సబ్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. బాబాయ్య దర్గా ఉరుసును పురస్కరించుకుని పీఠాధిపతి కుమారుడు నజర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి శుక్రవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ క్రీడలు నిర్వహించడమేగాక సామాజిక సేవా కార్యక్రమాలు ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్‌పీరా, పలువురు యతొపెద్దలు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పరిమితి మేరకే పరిహారం

ముదిగుబ్బ: జాతీయ రహదారి విస్తరణ కోసం భూములు కోల్పోతున్న రైతులకు జాతీయ రహదారుల సంస్థ పరిమితి మేరకే పరిహారం చెల్లిస్తామని ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బత్తలపల్లి నుంచి ముదిగుబ్బకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కోసం సంకేపల్లి, జొన్నలకొత్తపల్లి, గుంజేపల్లి గ్రామాల పరిధిలోని 173 మంది రైతులకు సంబంధించిన 41 ఎకరాల భూమిని సేకరించామన్నారు. వీరందరికి నోటిఫికేషన్ ఇచ్చినప్పటి రోజు నుంచి మూడేళ్లలోపు రిజిస్ట్రేషన్ జరిగిన వివరాలను తీసుకుని నిబంధనల ప్రకారం పరిహారం నిర్ణయిస్తామన్నారు. భూమితో పాటు చెట్లు, బోర్లు, బావులు, ఇతర నిర్మాణాలు ఏవైనా ఉన్నా, వాటికీ పరిహారం అందిస్తారన్నారు. ఈ సందర్భంగా పీసీరేవుకు చెందిన రైతు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... మార్కెట్ రేటుకు, జాతీయ రహదారుల సంస్థ నిర్ణయించిన పరిహారానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్, రైతులు సుధాకర్‌రెడ్డి, యోగానందరెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.